# శేష ప్రశ్న

కొబ్బరికాయ, మామిడికాయ కలిపి పచ్చడి చేసుకుని తినాలని మరీ మరీ అనిపించసాగింది ఆ రోజు స్వప్నకి. ఆ మాట తలచుకోగానే నోరూరింది. తనకి మామిడికాయతో చేసిన పప్పు, పచ్చడి... ఏదన్నా ప్రాణం. పుల్లపుల్లగా మామిడికాయ పప్పు వేదన్నంలో కలుపుకుని, కమ్మని నెయ్యి కలుపుకుని మజ్జిగ మిరపకాయ కొరుక్కుని తింటుంటే- కొబ్బరి కోరి, పుల్ల మామిడికాయ కోరి పచ్చడి చేసుకుని అన్నంలో కలుపుకుంటే, జిహ్వ లేచొచ్చినట్లుంటుంది. కాస్త తీరిక దొరికిన ఈ ఆదివారం ఉదయం కొబ్బరికాయ, మామిడికాయ వేసి పచ్చడి చేసుకోవాలన్న కోరికని అదుపులో పెట్టుకోలేక అప్పటికప్పుడు చున్నీ పైన వేసుకుని చెప్పులేసుకుని ఇంటికి తాళంపెట్టి ఎదురుగా నాలుగడుగులు వేస్తే కనిపించే 'ఫ్రెష్' వెజిటబుల్స్ దొరికే దుకాణానికి వెళ్లింది. చిన్న మామిడికాయ ఐదు రూపాయలట! సరే, ఎంతయినా కావాల్సిందేగా. పది రూపాయలకి రెండు కాయలు. ఇవాళ పచ్చడి, ఇంకో రోజు పప్పుకి ఉంటుందని రెండు కొంది. కొబ్బరికాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర కావలసినవి మరో రెండు కూరలు కొని ఇంటి ముఖం పట్టింది స్వప్న.

ఈ ఉద్యోగం కాదు కానీ, ఓ వేళాపాళా లేని ఈ కంప్యూటర్ కంపెనీ ఉద్యోగాలతో, ఇంటికి రాగానే వంట కాదు కదా కాస్త టీ కలుపుకు తాగాలన్న ఓపిక ఉండనట్టు వంట్లో శక్తి అంతా ఎవరో లాగేసినట్టు అయిపోతుంది. వంట అంటే ఏడుపే వస్తుంది. ఆదివారం కూడా వర్క్ చెయ్యాల్సిన రోజులే ఎక్కువ. మిగిలిన సగం పూటలో తప్పనిసరిగా ఇంత పప్పు వారానికి సరిపడా ఉడకేసి, పెద్ద గిన్నెడు చారు, పులుసో, రెండు రకాల కూరలు చేసి డబ్బాల్లో పడేసి ఫ్రీజర్‌లో పడేసి, అదే వారం రోజులూ వేడి చేసుకుని తినడం-ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ ధర్మమా అని తను స్నానం చేసి ఫ్రెష్ అయి వచ్చేలోగా అన్నం ఉడికేది. ఫ్రీజర్‌లో గడ్డకట్టినవన్నీ మళ్లీ కుక్కర్లో వేడి చేసుకుని ఆవురావురుమని తినడం-మధ్యాహ్నం ఆఫీసులో క్యాంటీన్‌లో సబ్సిడీ రేటుకి ఇచ్చే భోజనం, ఉదయం ఇంత పాలు కార్న్ ఫ్లేక్స్, తేనె, రెండు బ్రెడ్ ముక్కలు, అరటిపండ్లు బ్రేక్ ఫాస్ట్- రకరకాల టిఫిన్లు, రకరకాల కూరలు, పచ్చళ్లు, ఎప్పుడో అమ్మతోటే పోయాయి అని నిట్టూర్పు విడుస్తుంది తల్లి గుర్తుకు వచ్చినపుడల్లా. పాపం తల్లి ప్రాణం కనక వుండబట్టలేక ఆవిడ మధ్య మధ్య వచ్చి నెల రెండు నెలలుండి వెళ్లేది. ఉన్నన్ని రోజులు

రకరకాలు చేసి పెట్టేది. వెళ్లే ముందు నాలుగు రకాల పచ్చళ్లు, పొడులు ఫ్రిజ్ అంతా నింపి వెళ్లేది. ఇక్కడ నా దగ్గరే వుండవచ్చు కదా. అమ్మా, ఇటుకాక అటుకాక ఈ తిరుగుడెందుకు? అక్కడ ఇల్లు అద్దెకిచ్చేసి వచ్చేస్తే అందరం కలిసే వుండొచ్చుగా అనేది. వద్దులే తల్లీ! ఎంత కూతురువైనా నా ఇంట్లో స్వాతంత్ర్యం నాకుండాలి. మీ నాన్నగరూ ఒప్పుకోరు. ఆయనిక్కడ ఇమడలేరు. నీ ఆఫీసులు, టైమింగులు, ఓ రాత్రనక పగలనక నీ రాకపోకలు ఇవన్నీ చూస్తూ వూరుకోరు. ఏదన్నా అంటే నీవు కస్సుమంటావు. ఆయనేమో... నీవింటికి వచ్చేవరకు నిద్రన్నా పోకుండా లా కూర్చుంటారు. మాకీ వయసులో ప్రశాంతత కావాలి. ఈ టెన్షన్లు వద్దులే. నీ ఇల్లు నీ ఇష్టం వచ్చినట్లుండాలి అని నీకనిపిస్తుంది. ఈ వయసులో నీకు అన్నీ చెప్పి అడిగి చెయ్యాలంటే నాకూ కష్టమే. ఎవరింట్లో వాళ్ళుకుంటేనే మంచిదిలే అనేది. ఎందుకు నేనేం నిన్ను ఇలా వుండాలి. అలా వుండాలన్నానా...నీకు ఫ్రీడమ్ లేకపోవడానికి నేనేం అడ్డుకున్నానా...నొచ్చుకుని వాదనకు దిగేది. నీవన్నా అనకపోయినా స్వతంత్రించి ఏదన్నా చెయ్యాలంటే నాకే ఇబ్బందిగా ఉంటుంది.

"అది కాదులే. కూతురి డబ్బు తినకూడదని మీ అభిప్రాయం. ఎన్నాళ్ళయినా కూతురు కొడుకు తేడాలు మానరు మనవాళ్ళు. అందుకే తిండి ఖర్చంతా నీవే పెడ్తావు. కూరలు , పళ్లు అన్నీ కొంటావు. నేనిచ్చిన డబ్బు ఖర్చు పెట్టకుండా--అబ్బే అది కాదే.... చూడు ఆడపిల్ల అయినా, మగపిల్లాడు అయినా ఈ రోజుల్లో మాకూ ఎవరి దగ్గరా వుండకుండా స్వతంత్రంగా మా ఇంట్లో మేం పడుండాలనిపిస్తుంది. ఏదో దేవుడి దయవల్ల పిల్లల ముందు చేయి చాపకుండా గడిచిపోతున్నప్పుడు ఎందుకు వుండడం చూడాలనిపించినపుడు వచ్చి పోతున్నాం గదా! తల్లీ కూతురు ఇద్దరూ మధ్య మధ్య వాదించుకునేవారు ఈ విషయంలో.

తల్లి పోయేవరకు తన చింతతోనే పోయింది. ఒంటరిదయిందన్న దిగులు. పైకి చెప్పకపోయినా లోలోపల చాలా అశాంతి, చింతే ఆమెను తినేసేది. 'నాగురించి నీవేం బాధపడనక్కరలేదు. సంపాదించుకుంటున్నాను, హాయిగా స్వతంత్రంగా వున్నాను, నాకు లేని బాధ నీకెందుకు' అనేది ఆవిడ బయటికి చెప్పుకున్నప్పుడు.

'నాకెందుకు బాధో. అది నీవూ ఓ తల్లివయితే గానీ అర్థం కాదులే' అని 'ఆ అదృష్టం నీకీ జన్మకి లేదేమోలే' అని గొణిగేది రుక్మిణి.

'అమ్మా... పిచ్చి మాటలు చెప్పకు, ఆడదానికి మాతృత్వమే వరం' అని పాతపాటలు పాడకు. "నేనున్నాను అని నీకు భరోసా ఇచ్చే మనుషుండాలి ప్రతివారికి. అది లేకుండా

చేసుకున్నావనే బాధ. మొగుడు లేకపోయినా కడుపున పుట్టిన నీవాళ్లంటూ నీకు లేకుండా అయింది.

'స్టాపిట్ మమ్మీ!, బోరు కొట్టించకు'-లోలోపల అంతరాళంలో ఎక్కడో తల్లి మాటల్లో నిజం ఉందేమోననిపించే స్పందన కలిగినా, పైకి ఒప్పుకోవడానికి అహం అడ్డువచ్చేది.

'ఏమిటో జీవితం అంతా కుక్కలు చింపిన విస్తరిలా చేసుకున్నావు'-పైకి అనే ధైర్యం లేక గొణిగేది ఆవిడ వినిపించీ వినిపించనట్టు. స్వప్న కోపంగా చూసేది. 'అవును. మనసులు కలవని మొగుళ్లతో తిట్టుకుంటూ కొట్టుకుంటూ ఏడ్చుకుంటూ కాపురం చేసుకుంటుంటే చాలా ఆనందంగా వుండేది నీకు, నేను హాయిగా, సుఖంగా స్వతంత్రంగా వుంటే బాధలు పడిపోతున్నట్టు నీవు నా కోసం దిగులు పడిపోతావు', 'సుఖం, స్వతంత్రం.. రాత్రనక, పగలనక గొడ్డుచాకిరీ చేస్తూ కడుపునిండా కావలసినది వండుకుని తినే టైము లేక, ఓ సినిమా లేదు, ఓ టి.వి., ఓ పుస్తకం లేదు. ఓ సరదా లేదు, పని... పని.. అంటూ వాళ్లిచ్చే జీతం డబ్బులకి మిమ్మల్ని పిప్పి చేస్తుంటే. అదే జీవితం అయిపోయి ఓ మిషనులా తయారయి అన్ని అనుభూతులకి దూరమవడమే హాయి, స్వతంత్రం, సుఖం'-వెటకారంగా అంది రుక్మిణి. స్వప్న అంతకంటే వెటకారంగా- 'అవును'. వంటలు పిండివంటలు వండుకుంటూ వంటింట్లో పడుండి, పుచ్చగుడ్డలు, పీతిగుడ్డలు వుతుక్కుంటూ పిల్లలు, మొగుళ్లకి చాకిరీ చేస్తూ అదే జీవితం, సుఖం అనుకోవాలి మీలాగ, అపుడు నీకు తృప్తిగా వుండేది'.

'అవును. మేం చాకిరి అయినవాళ్లకి, కట్టుకున్న వాళ్లకి, కన్న పిల్లలకి చేసేవారం. ఇప్పుడు మీరు ఉద్యోగం పేరిట ముక్కూ మొహం తెలియని వాళ్లకి చేస్తున్నారు. అంతేతేడా. అది వంటింటి చాకిరి, ఇది ఇంకోరి దగ్గర చాకిరి.'

'చాల్లే అమ్మా.. నీతో వాదించలేం. మేం చదువుకుని ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదించడం, మీరు ఇంట్లో చేసే చాకిరికి పోలిక తెచ్చే నీతో మాట్లాడలేం. ఓ రూపాయి కావాలన్నా మొగుణ్ణి అడగాల్సిన బతుకు బతికిన క్రితం తరం ఆడవాళ్ళతో మమ్మల్ని పోల్చకు. మేం స్వతంత్రంగా మా కాళ్ళమీద మేం నిలబడి ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటుంటే...దానికీ, పాతకాలం ఆడవాళ్ల బతుకులకీ పోలిక తెస్తున్నావు' కోపంగా అంటూ ఉడుక్కుంటూ అనేది స్వప్న.

'ఏమో తల్లీ.. ఏం స్వంత్రమో నాకర్థం కాదు. మొగుడంటే ఒక్క మాట పడని మీరు ఇప్పుడు కుక్కిన పేనుల్లా మీ బాస్‌గారి ఆజ్ఞలను పాటిస్తూ... రాత్రనక, పగలనక, శెలవుపూట కూడా రాననే ధైర్యం లేకుండా చేసే ఈ చాకిరిని మరి ఏమంటారో నాకు

తెలియదు. మొగుడు చిన్నమాట అన్నా, చిన్న పని పురమాయించినా మేం నీ నౌకరులమా... అనే మీరు ఇప్పుడు ఈ నౌకరీలు ఎలా తలవంచుకు చేస్తున్నారో- ఆ పౌరుషాలు, ఆ ఆత్మాభిమానాలు, ఆ వ్యక్తిత్వాలు మరి అన్నీ ఏమవుతున్నాయో' రుక్మిణి గొంతులో హేళన. తల్లి మాటల్లో నిజాన్ని ఒప్పుకోవడానికి అహం అడ్డు వస్తుంటే, ఎలా అవిడ్ని నమ్మించాలో అర్థంకాని విసుగుతో-'నీకో దండం అమ్మా.. నిన్నెవరూ కన్విన్స్ చేయలేరులే. వదిలెయ్ ఆ టాపిక్' అనేది విరక్తిగా.

ఇలా తల్లి ఉన్నన్ని రోజులు తన జీవితంలో అన్నీ పొరపాట్లే చేసిందని వేలెత్తి చూపిస్తూ, నమ్మించాలని తాపత్రయపడేది. తన తరువాత కూతురు ఒంటరిదవుతుంది. ఆమెకంటూ ఓ సంసారం, భర్త, పిల్లలు ఏమీ లేకుండా ఒంటరిగా బతుకెలా ఈడుస్తుందన్న దిగులుతో ఏవేవో మాట్లాడేది సందు దొరికినపుడల్లా.

ఇప్పుడు తల్లిపోయాక నెత్తిన ముప్పై ఏడేళ్లు వచ్చాక, తన ఆలోచనల్లో మార్పు వస్తుందని తనకే అనిపించే వేళ తల్లి మాటల్లో కాదనలేని నిజాలు కొన్ని ఉన్నాయనిపించసాగింది. నిజంగా తను జీవితంలో అన్నీ పొరపాట్లే చేసిందా. వెనక్కి చూసుకుంటే నిజమేనని ఒప్పుకోక తప్పని నిజాలు.

మొదటిసారి పెళ్లి స్వయంకృతాపరాధమే! రాహుల్‌ని ప్రేమించాననుకుని, అతను లేనిదే బతకలేననుకుని, చదవన్నా పూర్తికాకుండా, నిండా ఇరవై ఏళ్లన్నా లేకుండా తొందరపడి ఇంట్లో చెప్పకుండా చెయ్యకుండా పెళ్లి చేసేసుకుంది. అతని అందం, స్మార్ట్‌నెస్, అతను పాడే రొమాంటిక్ సాంగ్స్, చెప్పే ప్రేమ కబుర్లు, తెలిసీ తెలియని టీనేజ్ వయసు, మెచ్యూరిటీ లేని ఆలోచనలు అన్నీ కలిసి తొందరపాటు నిర్ణయం తీసుకోవడం తప్పేనని అతికొద్ది రోజులలోనే అర్థమైంది. ప్రేమ కబుర్లు, ప్రేమ పాటలు తిండి పెట్టడానికి పనికిరావని, ఇల్లు-సంసారం గడవడానికి డబ్బు కావాలని, అది సంపాదించడానికి ఇద్దరికి క్వాలిఫికేషన్స్ సరిపోవని ఏడాదిలోగానే అర్థమై, ప్రేమ, మొహం అంతరించిపోయి సంసార ఇతిబాధలు మిగిలాయి. నీవల్లే నీవల్లే అనుకుంటూ ఒకరిమీద ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ, దెబ్బలాడుకుంటూ, భుక్తి గడవడానికి తను కొన్ని ట్యూషన్లు, అతను ఎవరో దూరపు బంధువు ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తూ ఓ ఏడాది గడిపారు. తను చేసిన పనికి ఓ ఏడాది తన మొహాన్ని చూడని తల్లి-తండ్రి కూతురు పడుతున్న ఇబ్బందులు చూసి కరిగి రాకపోక మొదలెట్టి, ఆర్థికంగా అపుడపుడు సాయంచేస్తూ ఇప్పటికైనా మించిపోయింది లేదు, చదువుకోమని, తన కాళ్లమీద తమ నిలబడేందుకు ఏదన్నా కోర్సులు చేయమని పోరుపెట్టి కంప్యూటర్ కోర్సులు చేయించడం మొదలుపెట్టారు. ఇంట్లో రాహుల్‌తో దినదినగండంగా కాపురం

తయారయి, ఒక్కక్షణం ఇద్దరికి పడక కాట్లకుక్కల్లా దెబ్బలాడుకుంటూ ఆఖరికి ఇద్దరికిద్దరు మ్యూచువల్ సెపరేషన్‌కి కోర్టుని ఆశ్రయించి డైవోర్స్ తీసుకున్నారు. మూడేళ్ల ఆ పెళ్లి ముచ్చట అలా ముగిసింది. దేవుడి దయ వల్ల పిల్లలు కలగకుండా జాగ్రత్త పడడంతో ఇద్దరూ తేలిగ్గా విడిపోయారు.

మొదటి అనుభవం చేదు అనుభవంగా మిగిలాకయినా రెండోసారన్నా జాగ్రత్త పడాలన్న జ్ఞానం లేక, పెద్దల మాట రెండోసారయినా వినకుండా మళ్లీ తప్పటడుగు వేసింది. తల్లి దండ్రి ఎంతో చెప్పారు. రెండో పెళ్లయినా ఫరవాలేదు. ఎవరో ఒకరు మంచివాళ్లని చూసి చేస్తాం-డైవోర్సులు ఇప్పుడు మామూలే. పిల్లల్లేరు కనుక పెళ్లి కష్టం కాదు, ముందు నీ కాళ్ల మీద నీవు నిలబడాలి అని ఎన్నో విధాలుగా చెప్పారు. కంప్యూటర్ కోర్సులు పూర్తికాకుండానే, కంప్యూటర్ కంపెనీ డైరెక్టర్ తన వెంటపడడం, డబ్బు, ఇల్లు, కారు, హోదా, స్మార్ట్‌నెస్ అన్నీ వున్న అతని ఎన్నిక ఈసారి సరయినదే అని భావించి అతన్ని వదులుకోవడం తెలివితక్కువ తనం అనిపించింది. రెండో పెళ్లిదాన్ని అయినా తను కావాలని, తన వెంటపడిన అతన్ని కాదనడం వచ్చిన సువర్ణావకాశం వదులుకోవడమేనని అనుకుంది. ఎటొచ్చీ ఈసారి అతన్ని తీసుకుని వెళ్లి తల్లి తండ్రికి పరిచయం చేసింది. చదువు, డబ్బు, హోదాతోపాటు రెండో పెళ్లి అయినా అభ్యంతరం లేదన్న అతని సంస్కారాన్ని, మంచితనాన్ని కాదనడానికి ఏమీ కనపడక తల్లి తండ్రి అంగీకారం తెలిపి వాళ్ల పెద్దవాళ్లతో వెళ్లి మాట్లాడారు. రెండో పెళ్లి అమ్మాయి అని వాళ్లు ముందు ఇష్టపడకపోయినా కొడుకు పట్టుదల చూసి తలాడించారు.

తన జాతకంలో మొగుడు, సంసారం అచ్చిరాలేదేమో- ఎన్నో ఆశలతో, కోర్కెలతో కాపురం మొదలుపెట్టిన తన వైవాహిక జీవితం మూన్నాళ్ళ ముచ్చటే అయిందీసారీ. అంతలా తన వెంటపడి నెల రోజులు సుఖంగా గడిచాయేమో-తరువాత నెమ్మదిగా అతని నిజ రూపం బయటపడసాగింది. 'ముందు, "నీకెందుకు ఇంకా ఈ చదువులు, కోర్సులు. నేను కష్టపడుతున్నది చాలు. నీవు కష్టపడనక్కరలేదు. హాయిగా ఇంటిపట్టున వుండి నన్ను, ఇంటిని చూసుకో' అంటూ తెలివిగా ఇంట్లో కూర్చోపెట్టాడు. అంతవరకు డబ్బుతో వచ్చే సుఖాలు అనుభవంలోకి రాని తను టి.వి.లు చూస్తూ, కారేసుకుని షాపింగ్‌లు చేస్తూ, ఇల్లు అలంకరించి, తను అలంకరించుకుని, ఎ.సి. రూములో పుస్తకాలు చదువుకుంటూ వుండడం బాగానే వుందనిపించేది.

కొన్నాళ్ళకి ఆ అనుభవం పాతపడ్డాక ఇంటిపట్టున వుండని భర్త, ఎక్కడికైనా వెళ్లాలన్నా ఒంటరిగా వెళ్లాల్సి రావడం, డబ్బు సంపాదన తప్ప భార్యతో సరస సల్లాపాలు, రొమాన్స్‌కి టైము లేనట్లుండి పట్టించుకోని రమేష్‌తో జీవితం అనుకున్నంత ఆనందంగా

అనిపించలేదు. అంత ప్రేమ ఒలకబోసిన రమేష్‌కి పెళ్లయ్యాక ఆ మోజు కొద్దిరోజుల్లోనే తీరిపోయిందని అలిగేది, సాధించేది. 'నీకేం లోటు, హాయిగా తిని కూర్చుని సాధిస్తావేం. రోజంతా నీ కొంగు పట్టుకుని కూర్చోవడానికి నాకేం ఉద్యోగం సద్యోగం లేదా. పెళ్లికి ముందు తిరిగినట్టు ఎప్పుడూ ఎవరూ తిరగరు. ఇంటికొచ్చేసరికి దెబ్బలాట పెట్టుకోకు' అంటూ విసుక్కునేవాడు. 'నాకేం తోచడం లేదు. నేనూ ఆఫీసుకి వస్తాను' అంటూ మొదలుపెట్టింది తను. 'అక్కరల్లేదు. నీవు ఉద్యోగం చేయడం నాకిష్టంలేదు. నేను సంపాదిస్తున్నది చాలు' అన్నాడు ఖచ్చితంగా. తనని కట్టడి చేసి ఇంట్లో కట్టిపడేశాడన్న భావన తనలో అహాన్ని లేపింది. ఆడదంటే ఇంట్లో పడుండాలి అన్న ఉద్దేశం వెలిబుచ్చినందుకు కోపం ముంచుకు వచ్చి అతనికి చెప్పకుండా కొన్ని ఉద్యోగాలకు అప్లయ్ చేసింది. పంతంగా రెండు మూడు ఇంటర్వ్యూలకు వెళ్లి వచ్చింది. ఆ సంగతి తెలిసి రమేష్ చాలా తీవ్రంగా హర్ట్ అయి పెద్ద గొడవ చేశాడు. 'అన్నీ నీకు చెప్పి చెయ్యక్కరలేదు. నాకు ఇంట్లో బోర్ కొడ్తోంది. ఉద్యోగం చెయ్యాలని వుంది. నన్నీ విషయంలో కట్టడి చేయకు' స్పష్టంగా చెప్పేసింది.

ఆరు నెలల కాపురానికే ఇద్దరికిద్దరూ ఎడమొహం పెడమొహంగా తయారయ్యారు. తనతో మాట్లాడకుండా సాధించసాగాడు. తను అంతకన్నా పంతం వచ్చి పట్టనట్టు వూరుకునేది. అడిగినంత డబ్బు ఇవ్వడం మానేశాడు. 'నీవు సంపాదించుకుంటున్నావుగా, ఖర్చు పెట్టుకో, నీకు తిండి పెట్టడమే నా బాధ్యత. నీ విలాసాలకివ్వాల్సిన పనిలేదు' అన్నాడు కావాలని రెచ్చగొడుతూ. అది చాలనట్టు మొదటి పెళ్లి, భర్త గురించి హేళనగా మాట్లాడడం మొదలుపెట్టాడు. 'నీలాంటి దాన్ని భరించలేకే వదిలేశాడు అతను. ప్రేమనుకుని నాలాగే అతనూ బురదలోకి దిగాడు పాపం. నిన్నెవడు భరించగలడు. అందగత్తెనని గర్వం, పొగరు. నీ అందం చూసి మగాళ్లు నీ వెంట పడతారని నమ్మకం. మగాడు ముందు అందానికి వలలో పడ్డా, పెళ్లియ్యాక అందం చూడడు. అణకువైన భార్య కావాలనుకుంటాడు. భార్యకు వుండాల్సిన లక్షణం ఒకటి అయినా వుందా నీకు. అదృష్టం బాగుంది నీ బారినుంచి తప్పించుకున్నాడు' అంటూ వీలయినప్పుడల్లా ఎత్తిపొడవడం, హేళనగా, వ్యంగ్యంగా బాణాలు విసురుతూ శాడిస్టిక్‌గా తయారయ్యాడు. అంతేకాదు, ప్రతి చిన్నవిషయం తల్లిదండ్రులతో తనమీద కంప్లయింట్ చెయ్యడం, వాళ్లేమో తప్పంతా తనదేనన్నట్టు చివాట్లు పెట్టడం, 'ఈసారైనా కాపురం సవ్యంగా చేసుకో. నీ దురుసుతనం తగ్గించుకో. ఏ మొగుడూ భార్య తిరగబడితే సహించడు. కాస్త దూకుడు తగ్గించి సవ్యంగా కాపురం చేసుకో. ఇది నీ రెండో పెళ్లి అని మర్చిపోకు. ఈ పెళ్లయినా నిలుపుకోకపోతే జీవితంలో ఒంటరి అయిపోతావు. సర్దకోవాలి, సర్దుకోవడం నేర్చుకో.

ప్రతిదానికీ వాదన పెంచి, నీవెంత అంటే నీవెంత అంటే ఏ మొగుడూ వూరుకోడని తెలుసుకో' అంటూ నచ్చజెప్తూ, మందలిస్తూ నీతులు చెప్పేవారు. తనమీద తల్లితండ్రికి కంప్లయింట్ చేస్తున్నాడని తను నిలదీస్తే-'అవును. వాళ్లకి కూతురు ఎలాంటిదో తెలియద్దా. లేకపోతే నేనేదో బాధలు పెడుతున్నానని అనుకోరూ. పాపం, వాళ్లు ఈసారన్నా కూతురు బుద్ధిగా కాపురం చేసుకోవాలని కోరుకుంటారు గదా, అన్ని సంగతులు వాళ్లకి తెలియాలిగా వ్యంగ్యంగా నవ్వేవాడు. 'యూ..యూ...' అంటూ ఆవేశంగా తిడ్తూ చిందులు తొక్కేది. తల్లి తండ్రి దగ్గర ఎంతో అభిమానంగా గౌరవంగా మాట్లాడేవాడు. ఊర్లో అందరి దగ్గరా చక్కగా వుండేవాడు. చూసే వారందరూ ఎంత మంచివాడు, సరదా అయినవాడు, ఎంత చక్కని జంట అనుకునేట్టు ప్రవర్తించేవాడు నలుగురిలో. ఒంటరిగా ఉన్నప్పుడు తన మొహం చూస్తే అతనికి, అతని మొహం చూస్తే తనకి ఇద్దరికిద్దరికీ తిక్కలు వచ్చేవి.

అదేం ఖర్మో..ఎంత శాంతంగా వుండాలన్నా ఏదో ఒకటి జరిగేది. ఏదో ఒకటి అని రెచ్చగొట్టేవాడు. దెబ్బలాట మొదలై చిలికి చిలికి గాలివాన అయ్యేది. చిన్న తగవులు సరేసరి. నెలకి నాలుగైదుసార్లు పెద్ద గొడవలే జరిగేవి. ఈ గొడవల మధ్యే తను నెల తప్పింది. నెల తప్పిన దగ్గరి నుంచి కాస్త ఇద్దరి మధ్య గొడవలు తగ్గాయి. కానీ దురదృష్టం అనాలో, కాపురం నిలిచే యోగం లేకనో పుట్టిన పిల్లాడు పుట్టీ పుట్టగానే కళ్లుమూశాడు. అది కూడా తన తప్పేనన్నట్టు అతను తనవంక తిరస్కారంగా చూసి, ఒక్క పలకరింపైనా, ఓదార్పయినా లేకుండా తలతిప్పుకు వెళ్లిపోయిన అతన్ని క్షమించలేక పోయింది. పుట్టిన వెంటనే పోవడంతో పెద్దగా బాధ అనిపించకపోయినా, ఎక్కడో లోపల పేగు కదిలి తనకి తెలియకుండానే నిట్టూర్పు వదిలేది. పిల్లాడే బతికుంటే ఇద్దరూ కాస్త దిగి వచ్చి సర్దుకుని బతికేవారేమో. పిల్లల వల్లే సగం సంసారాలు నిలబడతాయంటారు. తన సంసారం అదుకే నిలబడలేదేమో. అప్పటి నుంచి తనతో అంటీ ముట్టనట్టు పట్టించుకోవడమే మానేశాడు. కావాలని ఆఫీసులో పర్సనల్ అసిస్టెంట్‌తో సెల్‌ఫోన్లు, నవ్వులు, అమ్మాయిల ఫోన్లు ఇంటికి రావడం, ఎవరు అని నిలేస్తే, నీకనవసరం అని నిర్లక్ష్యంగా జవాబివ్వడం కావాలని తనని ఏడిపించడానికి రోజుకోసారి దెబ్బలాట పెట్టుకునేవాడు. అతని శాడిజం భరించలేక పండగ వంకని పుట్టింటికి చేరింది. ఇంక, చచ్చినా మళ్లీ వెళ్ళనని, ఆ కాపురం చెయ్యనని స్పష్టంగా చెప్పేసింది. తల్లితండ్రి నెత్తీనోరూ మోదుకున్నారు, ఎంతో చెప్పారు. అందరిచేత చెప్పించారు. వైవాహిక జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు అందరి జీవితాలలో వస్తాయి. ఊ...ఆ...అంటే కాపురాలు వదులుకుంటే లోకంలో ఎవరూ కలిసి బతకలేరు. పెళ్లి

అంటే కలసి బతకడం. కలసి బతకాలంటే సర్దుబాటు తప్పదు. ఏ మగాడూ ఎదిరించి జవాబిచ్చే భార్యని ఊరుకోడు. ఇది కాదు, ఇంకో నాలుగు పెళ్ళిళ్లు చేసుకున్నా నీలో ఆత్మాభిమానాలు, పౌరుషాలు తగ్గించుకోకపోతే కాపురం నిలదు. రెండు పెళ్ళిళ్ళయ్యాక, ఇంక నిన్నెవడు చేసుకుంటాడు. నీవింక జీవితంలో ఒంటరిగా మిగిలిపోతావు. నిన్ను ఆదుకోవడానికి మా దగ్గర లక్షలు లేవు. ఎన్ని రకాలుగానో భవిష్యత్తు భూతద్దంలో చూపించి భయపెట్టినా తన మనసు మార్చుకోలేదు. చెప్పీ చెప్పీ విసిగెత్తి వూరుకున్నారు. మొగుడు రెండు మూడు లాయరు నోటీసులు పంపి, వెళ్లకపోవడంతో డైవోర్సు పేపర్లు పంపించాడు. సంతకం పడేసి వదుల్చుకుంది.

జీవితంలో రెండో అధ్యాయం ముగిసింది. మిగిలిపోయిన రెండు మూడు కోర్సులు పూర్తి చేయించి తనకి ఉద్యోగం రాగానే ఇంక నీ బతుకు నీది అని వదిలేశారు తల్లి దండ్రి. చూడాలన్నప్పుడు వచ్చిపోవడం వరకే సంబంధం పెట్టుకున్నారు.

జీవితం గానుగెద్దులా తయారైంది. తెల్లారి లేస్తూనే ఇంత నోట్లో పడేసుకుని ఆఫీసుకెళ్ళడం, రాత్రి అలసిపోయి రావడం, విశ్రాంతి అంటూ లభిస్తే కంప్యూటర్ ముందు ఎ.సి. రూములో కూర్చోవడమే. ఓ స్నేహితులు లేరు. ఓ సరదా, ఓ పుస్తకం లేదు, బంధువులు లేరు, కడుపారా తిండి లేదు. పని... పని...వర్క్...వర్క్...ప్రాజెక్ట్ తరువాత ప్రాజెక్ట్. ఆ ప్రాజెక్ట్ వర్క్ పూర్తి అయ్యేవరకు రాత్రనక పగలనక పూర్తి చెయ్యాల్సి రావడం. మధ్యలో రెండు రోజులు కాస్త ఆటవిడుపు. మళ్ళీ ఇంకో ప్రాజెక్ట్. ఆ కంప్యూటర్‌కీ, తమకీ తేడా లేదు. బట్టల మీద, నగల మీద వ్యామోహం లేదు. ఎవరి కోసం, ఎవరు చూడాలి రెండు జీన్ ప్యాంట్స్, రెండు టాప్స్ చాలు. హాయిగా నూనె రాసుకుని, తలంటుకుని ఎన్నాళ్లయింది. కమ్మగా నచ్చినవి వండిపెడితే భోంచేసి ఎన్నాళ్లయింది. జీవితంలో తను ఏం సాధించింది-అన్న ఆలోచనలు వచ్చినప్పుడు జీవితం రొటీన్ అయి, నిస్సారంగా అనిపించినప్పుడు తను రెండోసారి రమేష్‌తో కాస్త సర్దుకోవలసిందేమో. 'సై అంటే సై అనకుండా కాస్త అహం తగ్గించుకుని వుంటే' అన్న ప్రశ్న తలెత్తేది. తల్లితండ్రి పోయాక తన గురించి పట్టించుకునే వారే లేరు. ఎప్పుడో అమెరికాలో వున్న అక్క ఫోన్ చేస్తుంది. అంతే' వూర్లో వున్న మేనత్త, పిల్లలు ఎప్పుడన్నా కనిపించి ఇంటికి రా అని పిలుస్తారు. ఎక్కడికీ వెళ్లాలనిపించదు. అందరూ తనను సానుభూతితో చూస్తున్నారనిపిస్తుంది. ఎన్నాళ్ళీలా ఇంత నిస్సారంగా బతకడం. తన వయసు అన్ని అనుభవాలకి దూరం అయిపోయినట్టనిపిస్తుంది. ఈ వయసలో తను కావాలన్నా ఎవరు చేసుకుంటారు. చేసుకున్నా, తన ఉద్యోగాన్నో, తన సంపాదనో

చూసుకుని ఎవడన్నా ముందుకు వచ్చినా, తను మళ్లీ సర్దుకుని బతికే స్థితిలో వుందా. మళ్లీ లంపడం తగిలించుకోవడం ఎందుకు?

వెనక్కి తిరిగి చూసుకుంటే, తన జీవితం ఎందుకిలా తయారయింది అని ప్రశ్నించుకుంటే- తనలో లోపాలే అన్న జవాబు వస్తుంది. సర్దుకునే మనస్తత్వం లేకనే ఇలా తయారయ్యింది సర్దుబాటు. సర్దుబాటంటారు... ఎంతవరకు సర్దుకోవాలి? తమ హక్కులు కాపాడుకోవాలంటే ఎంతవరకు తిరగబడాలి? ఎవరన్నా గిరిగీసి పాఠాలు తయారుచేస్తే... బరిగీసి ఆడదాన్ని ఇదివరకు బరిలో కూర్చోపెట్టారు. ఇప్పుడు గిరిగీసి ఈ గీత దాటొద్దు అని చెప్పాలేమో కాపురాలు నిలవాలంటే. అంటే ఎప్పుడూ బరిలో, గిరిలో వుండాల్సింది, సర్దుకోవాల్సింది ఆడదేగా. ఎన్ని యుగాలు గడిచినా ఆడదానికి భర్త, ఇల్లు, పిల్లలు, సంసారం కావాలంటే బరి మధ్య, గీత లోపల బతకాల్సిందేనన్నమాట! తనని పెళ్లి చేసుకున్న మగాళ్ళిద్దరూ మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకుని హాయిగా బతికేస్తున్నారు. తన జీవితమే పాడయింది. నిజంగా పాడయిందా? పాడు చేసుకుందా? ఒంటరిగా జీవించడం అంటే జీవితం పాడయినట్టేనా? భర్త, పిల్లలు లేకుండా బతకడం అంటే జీవితంలో అన్నీ కోల్పోయినట్టేనా? కోల్పోయినట్టే అని తనకనిపిస్తుంది గదా! అందుకేనా ఆడవాళ్లు సర్దుకుపోతుంటారు. ఒంటరి బతుకు కంటే అదే నయమా? అర్థం లేని ప్రశ్నలు చుట్టుముట్టి నిద్రలేని రాత్రిళ్ళు ఎంత వెతికినా జవాబు దొరకదు స్వప్నకి.

◆ కథాపత్రిక, నవంబర్-2002